విద్యార్థులకు కంప్యూటర్ క్లాసులు

విశాలాంధ్ర-బాడంగి: స్థానిక గ్రంథాలయంలో కంప్యూటర్ బేసిక్స్ నేర్చుకుంటున్న విద్యార్థులు ఆదివారం నేర్చుకుంటున్నారు. విజయ నగరం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వారికి ఆదేశాలు మేరకు ప్రతీ ఆదివారం చదవడం మా కిష్టం కార్యక్రమంలో భాగంగా బాడంగి గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఆర్. దుర్గా ప్రసాద్ విద్యార్థినీ విద్యార్థులతో నీతి కథలు చదివించడంతో పాటు ఆటలు , కంప్యూటర్ బేసిక్స్ కూడా నేర్పిస్తున్నారు. బాడంగి గ్రంథాలయంలో పిల్లలు పెద్దలకు పోటీ పరీక్షలకు అవసరమైన అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంటున్నాయి. కావున ప్రతీ ఒక్కరూ వినియోగించుకొని బాడంగి గ్రంథాలయాలధికారి కోరారు . సెలవు దినంలో విద్యార్థులకు కంప్యూటర్ తో పాటు మంచి మంచి కథల పుస్తకాలు చదివించాలని తల్లిదండ్రులను కోరారు. విద్యార్థులలో పుస్తకాలను చదవడం పై మక్కువ చూపే విధంగా వారికి తర్ఫీదు ఇవ్వడం ఆనందాయకంగా ఉందని పలు విద్యార్థులు పేర్కొంటున్నారు.

విశాఖ ఉక్కును పరిరక్షించు కుందాం...

- 32 మంది ప్రాణాల త్యాగ ఫలితం
- క్యాబినెట్ తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలి
- అఖిలపక్ష సమావేశంలో తీర్మానం

(విశాలాంధ్ర-విజయనగరం)

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉత్తరాంధ్ర ప్రజలంతా సంఘటితంగా పోరాటం చేయాలని, ఉక్కు కర్మాగారాన్ని పరిరక్షించుకునేందుకు ఉత్తరాంధ్ర ప్రజలంతా ఉద్యమించాలని అఖిలపక్ష సమావేశంలో తీర్మానించారు. స్థానిక ప్రెస్ క్లబ్లో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్మన్, వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు వైసిపి పార్టీ మద్దతిస్తుందని ప్రకటించారు. ఉత్తరాంధ్ర ప్రజల అభివృద్ధి కోసం విశాఖ ఉక్కును పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇందుకోసం వైసిపి పార్టీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఎంతోమంది పోరాటాలు చేసి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరించకుండా అందరూ సంఘటితంగా పోరాటం చేయాలన్నారు.
ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ విశాఖ ఉక్కును పార్టీలకు అతీతంగా కాపాడుకోవాల్సిన బాధ్యత ఉత్తరాంధ్రప్రజలపై ఉందన్నారు. గౌతు లచ్చన్న, తెన్నేటి విశ్వనాథం వంటి ఎందరో మహనీయుల పోరాటాల ఫలితంగా విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పడిందని,ఉత్తరాంధ్ర ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, దీనిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క ఆంధ్రుడు పై ఉందని స్పష్టం చేశారు.ఉత్తరాంధ్ర ప్రజాసంస్థ కన్వీనర్, లీడర్ అధినేత వివి రమణమూర్తి మాట్లాడుతూ 32 మంది ప్రాణాల త్యాగం ఫలితంగా

సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్, వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మగారాన్ని ప్రైవేటీకరణ చేయకుండా అడ్డుకోవలసిన బాధ్యత ఉత్తరాంధ్ర ప్రజలపై ఉందని స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణ విషయంలో ఉత్తరాంధ్ర ప్రజలు పెద్దఎత్తున తిరగబడి, ఉత్తరాంధ్ర ప్రజల బలాన్ని నిరూపించాలని పిలుపునిచ్చారు. 2021లో కేంద్ర క్యాబినెట్ ఆమోదించిన విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ తీర్మానాన్ని వెనక్కితీసుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా క్యాబినెట్లో తీర్మానం చేసి, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర విభజన సమయంలో కూడా ఇంకా చివరి బాలు ఉందంటూ రాష్ట్రాన్ని విభజించి ఆంధ్ర ప్రజలకు అన్యాయం చేశారని, అదేవిధంగా విశాఖ ఉక్కు కర్మాగారం విషయంలో కూడా తాము ఉక్కు కర్మాగా రాన్ని రక్షిస్తామని కూటమి ప్రభుత్వం చెప్పే మాటలను నమ్మే పరిస్థితి లేదని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం విశాఖలో 10 లక్షల పోస్ట్ కార్డులతో ఉద్యమిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా విజయనగరంలో ఒక లక్ష, శ్రీకాకుళంలో మరో లక్ష పోస్ట్ కార్డులతో ఉద్యమాన్ని చేపట్టి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఒక పెద్ద లాంగ్ మార్చ్ గా విశాఖలో తపాలా కార్యాలయానికి చేరుకొని కేంద్ర ప్రభుత్వంపై పోస్ట్ కార్డులు ద్వారా ఉత్తరాంధ్ర ప్రజల ఉద్యమాన్ని తెలియజేద్దామని పిలుపునిచ్చారు. విశాఖ ఉక్కు ఉద్యమాన్ని ప్రతి ఇంటికి తీసుకువెళ్లాలని ఆయన ఉత్తరాంధ్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఉత్తరాంధ్ర ప్రజలకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లేక పొట్ట చేత పట్టుకొని ఇతర రాష్ట్రాలకు వెళ్లి బతుకుతున్నారని, విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేస్తే ఉత్తరాంధ్ర ప్రజలకు మరింత అన్యాయం జరుగుతుందన్నారు. లాభాల బాటలో ఉండే విశాఖ ఉక్కును నష్టాల్లో నడుస్తున్నట్లు వంక చూపించి ప్రైవేటుపరం చేస్తే ఉత్తరాంధ్ర ప్రజలు చేతులు కట్టుకోరని హెచ్చరించారు. జనవిజ్ఞాన వేదిక జాతీయ కార్యదర్శి డాక్టర్ ఎంవిఆర్ కృష్ణాజి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొంగలి పోతన్న, ఆప్ రాష్ట్ర కన్వీనర్ సీర రమేష్, ఆప్ నాయకుడు నయుం, సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, ఏఐటీయూసీ అధ్యక్షుడు రంగరాజు, సిపిఎం నాయకులు రెడ్డి శంకర్రావు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు రాము, ఏపిటిఎఫ్ రాష్ట్ర కే.ఈశ్వరరావు, బంకుర జోగి నాయుడు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు రామ్మోహన్, సిఐటియు నాయకుడు సురేష్, న్యాయవాది గేదెల సత్యం, ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, అంబేద్కర్ వాది పొంద్రంకి వెంకటరమణ, దళిత సంఘ నాయకుడు బంగ భానుమూర్తి, జన విజ్ఞాన వేదిక జాతీయ నాయకులు గంద్రేటి లక్ష్మణరావు, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పైల రమేష్ రాజు, జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్,నగర అధ్యక్ష,కార్యదర్శులు షిణగం శివాజీ,పి. షణ్ముఖరావు, జేవివీ నాయకులు కర్రి సత్యనారాయణ, సుంకర సూర్యనారాయణ ఉత్తరాంధ్ర ఆర్ఎంపిలు సంఘం జిల్లా అధ్యక్షుడు గెద్ద చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

విశాలాంధ్ర-చీపురుపల్లి : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారిని చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళావెంకటరావు ,యువ నాయకులు రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ మల్లిక్ నాయుడు ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించు కున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సంద ర్భంగా అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు.అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలిచ్చి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా కిమిడి మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలకు వచ్చిన భక్తులు అందరికీ మంచి జరగా లని అమ్మ ఆశీస్సులు జిల్లా ప్రజలపై ఉండాలని కోరుకుం టున్నానని అన్నారు. పైడిమాంబ ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని ఎమ్మెల్యే కళావెంకటరావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొండపల్లి అప్పలనాయుడు విజయనగరం జిల్లా టిడిపి కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి తొలేళ్ళు, సిరిమానోత్సవ ప్రసాద వితరణ లో ప్లాస్టిక్ నిషేధం

విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ న్యూస్: విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రెండు ప్రత్యేక దినాలలో భక్తులకు వివిధ ప్రాంతాలలో అనేకమంది ప్రసాద వితరణ కార్యక్రమాలు చేపడుతుంటారని అయితే ప్రసాదాలు మాత్రం కేవలం విస్తరాకులతో గాని, పేపర్ ప్లేట్లులో మాత్రమే భక్తులకు అందించాలని సూచించారు.ప్లాస్టిక్ వినియోగానికి తావు లేదని స్పష్టం చేశారు. అలాగే ప్రసాద వితరణ చేపడుతున్న ప్రాంతాలలో ప్రత్యేకంగా డస్ట్ బిన్లను నిర్వాహకులే ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఎక్కడ ఎటువంటి ఇబ్బందికర పరిస్థితు లకు తావు ఇవ్వకూడదని తెలిపారు. రహదారులపై వచ్చులవిడిగా చెత్తాచెదారాలను వేయవద్దని చెప్పారు. క్లీన్ జాతరగా చేపట్టే ప్రక్రియలో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలన్నారు. ప్రసాద వితరణ చేపడుతున్న వారు ముందుగా నగరపాలక సంస్థ అధికారులకు తెలియపరచినట్లయితే డస్ట్ బిన్ లో వేసిన వ్యర్థ పదార్థాలను తొలగించే ఏర్పాట్లు చేపడతారని పత్రిక ప్రకటన ద్వారా ప్రజలకు తెలిపారు.

సాహితీ ప్రియులను అలరించిన శతాధిక కవి సమ్మేళనం భువన విజయం

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : విజయనగరం ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఎమ్మార్ రిక్రియేషన్ క్లబ్ లోని సాహిత్య వేదికపై ఆదివారం నిర్వహించిన పలు కార్యక్రమాలు సాహితీ ప్రియులను అలరించాయి. ఈ సందర్భంగా నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శతాధిక కవి సమ్మేళనం భువన విజయం ఆకట్టుకున్నాయి. మహారాజా సంస్కృత కళాశాల ప్రిన్సిపాల్ గంటా జనార్ధన్ నాయుడు నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున కవులు సాహితీవేత్తలు పాల్గొని తమ సాహితీ ప్రతిభను ప్రదర్శించారు. శతాధిక కవి సమ్మేళనం కార్యక్రమాన్ని రత్నాల బాలకృష్ణ చీకటి దివాకర్ సూర్యలక్ష్మి మానాప్రగడ సాహితీ తదితరులు ఆధ్వర్యంలో నిర్వహించగా కొంతమందికి పైగా కవులు తమ కవితలను చదివి వినిపించారు. వారందరినీ జ్ఞాపిక శాలువా తో సత్కరించారు. భువన విజయం కార్యక్రమానికి జక్కు రామకృష్ణ కట్టమూరి చంద్రశేఖరరావు అనుసంధానకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ తిరుపతి నాయుడు స్కిల్ దెవలప్మెంట్ ఆఫీసర్ జి ప్రశాంత్ కుమార్ జిల్లా సహకార అధికారి రమేష్ తదితరులు ఆధ్వర్యంలో నిర్వహించారు.

మరుపల్లిలో మజ్జి గౌరమ్మ తల్లి పండగ

విశాలాంధ్ర-గజపతినగరం : మండలంలోని మరుపల్లి గ్రామం లో మజ్జి గౌరమ్మ తల్లి పండగను ఆదివారం గ్రామ ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు చేసి నిర్వహించారు భక్తులు రద్దీ నిమిత్తం క్యూలైన్లు ఏర్పాటు చేశారు ఎండల తీవ్రత దృశ్య టెంట్ల ఏర్పాటు చేసి భక్తులకు ఉపశమనం కల్పించారు అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు గ్రామస్తులు మొక్కుబడులు చెల్లించారు భక్తులకు ఎటువంటి ఇబ్బంది కమిటీ సభ్యులు గ్రామ సర్పంచ్ నాయకులు లంక సత్యనారాయణ రామలక్ష్మి తగు ఏర్పాట్లు చేశారు.

పైడితల్లి అమ్మవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే అదితి

విశాలాంధ్ర-విజయనగరం: ఉత్త రాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారిని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, తదితరులు దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం వీరికి వేద పండితులు ఆశీర్వచనాలిచ్చి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు

దేశ సేవలో యువత భాగస్వామ్యం కావాలి

చీపురుపల్లి ఫైర్ స్టేషన్ ఎస్ఐ హేమసుందర్

విశాలాంధ్ర-చీపురుపల్లి: చీపురుపల్లి అగ్నిమాపక కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్ర మంలో నేతాజీ ఫిట్నెస్ అకాడమీ తరుపున ఉచితంగా శిక్షణ అందించిన కోచ్ కె.వేణుగోపాల్, పిసి స్వరూప్ ఆధ్వర్యంలో ఆర్మీ అగ్నిపథ్ లో ఉద్యోగ సాధించిన 10 మంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతకు సన్మా నించారు. కార్యక్రమంలో చీపురుపల్లి ఫైర్ స్టేషన్ ఎస్ఐ హేమసుందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత కష్టపడే తత్వాన్ని అలవాటుచేసుకోవాలని లక్ష్యం మీద దృష్టి పెట్టాలని మరొకరు కి స్ఫూర్తి గా నిలవాలని మీ కుటుంబాన్ని బాగా చూసుకోవాలి అన్నారు. విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇచ్చిన కోచ్ లను ఆయన అభినం దించారు. అనంతరం అగ్నిపత్ నందు ఎంపికైన యువతకు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డోల నాగరాజు, పీడీ మురళీ, వెటర్నరీ పీడీ. త్రినాథ్, ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ, లక్ష్మణ యువత పాల్గొన్నారు.

పెచ్చుమీరుతున్న ఆకతాయిల ఆగడాలు

రామాంజనేయ కాలనీలో ద్విచక్ర వాహనం దహనం..

విశాలాంధ్ర-చీపురుపల్లి : ఆకతాయిలో ఆగడాల కారణంగా చీపురుపల్లి పట్టణ పరిధిలోని రామాంజనేయ కాలనీలో గుర్తుతెలియని వ్యక్తులు శనివారం రాత్రి ఓ ద్విచక్ర వాహనానికి నిప్పంటించి దహనం చేశారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుల కోసం గాలిస్తున్నారు. రామాంజనేయ కాలనీ, అంబేద్కర్ నగర్, వంగపల్లిపేట, తదితర ప్రాంతాలకు పోవు ప్రధాన రహదారిలో ద్విచక్ర వాహనం దహనం చేయడం పట్ల స్థానికులు భయాం దోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు దృష్టి సారించి ఆకతాయి లాగడానికి అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నీటి సంఘాల ఎన్నికలకై రైతు ఓటర్ల జాబితా తయారుకు గ్రామ రెవెన్యూ అధికారులు సిద్ధంకండి

తహశీల్దార్ శ్రీను

విశాలాంధ్ర-బొబ్బిలి : మండల పట్టణ పరిధిలో 13 ఇరిగేషన్ చెరువులు, ఐదు మీడియం ఇరిగేషన్ చెరువులు ఆయకట్టు సంఘాల రైతులను ఓటర్ నమోదుగా చేయడానికి సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులంతా ఓటరు జాబితా తయారు చేయడానికి సిద్ధం కావాలని తహశీల్దార్ ఎం శ్రీను ఆదేశించారు. ఆదివారం తహశీల్దార్ కార్యాలయంలో నీటి సంఘాల ఎన్నికల ఓటర్ల నమోదు జాబితా తయారు పై ఎన్నికల ఉప తహశీల్దార్ గౌరీ శంకర్ ఆధ్వర్యంలో సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

వెలమాంధ్ర ఆధ్వర్యంలో వికలాంగులకు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర -జామి: మండలం లోని అలమండ గ్రామంలో ఆదివారం వెలమాంధ్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామంలోని వికలాంగులకు దుప్పట్లను పంపిణీ చేసారు. మండల టీడీపీ అధ్యక్షుడు లగుడు రవికుమార్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నేత గొంపకృష్ణ, డిసిసిబి మాజీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు చేతుల మీదుగా దుప్పట్లను పంపిణీ చేసారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఎంవిఆర్ మూర్తి మాట్లాడుతూ ఉత్తరాంధ్ర రైతుల ఆరాధ్య దైవం గొర్రిపాటి బుచ్చిఅప్పారావు 111 జయంతిని పురస్కరించుకుని ఈకార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బందారుపెదబాబు, ఉపసర్పంచ్ లగుడు దేముడు, గనివాడ ఎర్నాయుడు, రాయవరపు శంకర్, గొర్లె ఎర్నాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స.హ. చట్టం పై అవగాహన

విశాలాంధ్ర -శృంగవరపుకోట: ఎస్.కోట పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర ఉన్న మహాత్మా గాంధీ విగ్రహం వద్ద సమాచార హక్కు చట్టం జిల్లా సమన్వయ కమిటీ సభ్యులు దొడ్డి సూర్యారావు న్యాయవాది జియో వ్యవస్థాపకులు బి రామకృష్ణ సహ చట్టం ఉద్యమకారులు సిహెచ్ రామకృష్ణ లంక సాంబమూర్తి తదితరులతో కలిసి కలిసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వర్ధిల్లాలి వర్ధిల్లాలి 2005 సహచట్టం వర్ధిల్లాలి సహ చట్టాన్ని వినియోగిద్దాం అవినీతిని అంతం చేద్దాం అభివృద్ధిని సాధిద్దాం సహ చట్టాన్ని అమలులోకి తెద్దాం ప్రభుత్వ యంత్రాంగంలో జవాబుదారితనం పారదర్శకత పెంపొందిద్దాం సహ చట్టాన్ని వినియోగించే నిజాయితీపరులకు అమలు చేసే నిజాయితీ గల అధికారులకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని అనే నినాదాలు ఇవ్వడం జరిగినది ఈ సందర్భంగా డి సూర్యారావు మాట్లాడుతూ సహ చట్టం దేశంలో ఉన్న 140 కోట్ల మంది ప్రజలను యజమానులను చేయడానికి 2005 లో వచ్చిందని ఈ చట్టం పేద సామాన్యుడి చేతిలో బ్రహ్మాస్త్రం పాశుపతాస్త్రం వజ్రాయుధం వంటిదని దేశంలో పెద్దపెద్ద కుంభకోణాలన్నీ ఈ చట్టం వచ్చిన తర్వాతే బయటికి వచ్చాయని ఈ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసే మెక్సికో వంటి దేశాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి ఈ చట్టాన్ని అమలు చేసే అధికారులకు చట్టాన్ని వినియోగించే పౌరులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి చట్టాన్ని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తేవాలని కోరారు.

ఉత్సాహంగా...ఉత్సవ పోటీలు

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : విజయనగరం ఉత్సవాల సందర్భంగా రెండు రోజుల పాటు తలపెట్టిన క్రీడా పోటీలు ఆదివారం సాయంత్రం విజ్జీ మైదానంలో ఉత్సాహభరిత వాతావరణంలో క్రీడాకారుల కేరింతల నడుమ ప్రారంభమ య్యాయి. పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్నాయుడు పోటీలను ప్రారంభించి నిర్వాహకులకు, క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. విజయనగరం వైభవాన్ని నలువైపులా చాటేలా నిర్వాహకులు చేసిన ఏర్పాట్లు ప్రశంసనీయమన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, స్కేటింగ్ విభాగాల్లో నిర్వహించిన పోటీలకు పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున క్రీడాకారులు తరలివచ్చారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులలో సరదాగా ఆడుతూ క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపారు. విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్, టోర్నమెంటు నిర్వాహకులు అవనాపు విజయ్, డీ .ఎస్ .డీ వో .ఎస్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందక రైతుల ఆందోళన

విశాలాంధ్ర-వంగర : తోటపల్లి కుడి కాల్వ ద్వారా గత కొన్ని రోజుల నుండి సాగునీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదివారం నాడు సాయంకాలం కొత్తవలస గ్రామంలో రైతులు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు, ప్రకృతి వ్యవసాయ ప్రకృతిసేద్యం పాఠ్యాంశాల రచయిత, రాష్ట్రపతి అవార్డు గ్రహీత పెంకి గౌరీశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు,రైతులు పాల్గొని తోటపల్లి ఇంజనీరింగ్ అధికారులపై తీవ్రంగా దుమ్మెత్తి పోశారు. పంటలు ఎండిపోతున్నప్పటికీ తోటపల్లి ఇంజనీరింగ్ అధికారులు పట్టించు కోవడం లేదని ఆందోళన చెందుతున్నారు. సాగు నీరు అందక వరి పంట ఎండిపోతుందని రైతులు పలు నినాదాలు చేశారు.వెంటనే ఎండుతున్న పంట పొలాలకు సాగు నీరు విడుదల చేయాలని రుతులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కలెక్టర్,నీటి పారుదల అధికారులు కల్పించుకొని తోట పల్లి కుడికాల్వ నుండి సాగు నీటిని విడుదల చేసేటట్లు చూసి, నీరులే క ఎండు తున్న పంటలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులను కోరుతున్నారు. కార్యక్రమంలో పెంకి గౌరీశ్వరరావు, టీడీపీ నాయకులు గోవింద, సాగు రైతులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆనంద గజపతి ఆడిటోరియంలో భరతనాట్య నృత్య ప్రదర్శన

విశాలాంధ్ర- విజయ నగరం ఫోర్ట్: పైడితల్లి అమ్మవారి సిరిమా నోత్సవం సందర్భంగా జరిగే విజయనగర ఉత్సవాలలో భాగంగా ఆనంద గజపతి ఆడిటోరియంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో సూర్య అకాడమీ విద్యార్థులచే భరతనాట్య నృత్య కార్యక్రమం ప్రదర్శించారు. సూర్య అకాడెమీ ఫౌండర్ టివి రామ్ కాశ్యప్ ఆధ్వర్యంలో ఐశ్వర్య, జ్యోతి బృందంచే నృత్య ప్రదర్శనలో భాగంగా దేవీశ్రీ,, సంజన, అక్షిత, వర్షిత, శ్రీవల్లి, సునంద, భూమి, ఆద్యా, లాస్యశ్రీ, సంజన, నేహశ్రీ, అక్షర, రుహ్విక, మీనా లాస్య, కుష్విక, సునంద, మనస్వీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గౌరవనీయులైన ఉమా శంకర్ (ఎన్ఈ ఆర్ఈడబ్ల్యుఎస్) ఎస్. జానకి (డిఎం పీఆర్వో) వారి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, షీల్డ్, ఉపాధ్యాయులకు సన్మాన సత్కారాలు చేసి అభినందించారు.

హైకోర్టులో పిటిషన్ ఉండగా అక్రమార్గంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలి

అక్రమ రిజిస్ట్రేషన్ పై ఎమ్మెల్యే స్పందించాలి : సిపిఐ

విశాలాంధ్ర-బొబ్బిలి: సిబిఎం స్కూల్ స్థలం నిబంధనలకు విరుద్ధంగా హైకోర్టులో పిటిషన్ ఉండగా భూమిని అక్రమార్గంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత తూముల భాస్కరరావు సిబిఎం స్కూల్ కరస్పాం డెంట్ రత్నకుమార్ లపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి అరెస్ట్ చేయాలని భారత్ కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న లు డిమాండ్ చేశారు. సిబిఎం స్కూల్ స్థలం నిబంధనలకు విరుద్ధంగా హైకోర్టులో పిటిషన్ ఉండగా భూమిని అక్రమార్గంలో రిజిస్ట్రేషన్ చేసిన కరస్పాండెంట్ రత్నకుమార్ తప్పుడు మార్గంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న వైయస్సార్ కాంగ్రెసు పార్టీ నేత తూముల భాస్కరరావు లపై చర్యలు, అక్రమ రిజిస్ట్రేషన్ రద్దుపై స్థానిక ఎమ్మెల్యే బేబీ నాయన చొరవ తీసుకుని స్కూలు స్థలము అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. సిబిఎం స్కూల్. ఉన్నత విలువలతో పేద మధ్యతరగతి దళిత విద్యార్థులకు విద్యను అందించడానికి స్థాపించి సుమారు 110 సంవత్సరాలు చరిత్ర ఉన్న స్కూలును. గుప్పు చప్పుడు కాకుండా చీపురుపల్లిలో క్రయవిక్రయాల జరగడం అక్రమ రిజిస్ట్రేషన్ కు పాల్పడడం దుర్మామని అన్నారు. సిబిఎం స్కూల్ వ్యవహారంపై స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి స్కూల్ అక్రమ రిజిస్ట్రేషన్ రద్దుచేసి. న్యాయం చేయాలని ఈ సందర్భంగా కోరారు. 100 కోట్లు విలువచేసే స్కూలు స్థలాన్ని కారు చౌకగా వైసీపీ నేత తూముల భాస్కరరావుకు రిజిస్ట్రేషన్ ఏవిధంగా చేస్తారని సంబంధిత శాఖ అధికారులను ప్రశ్నించారు. ఈ సమావేశంలో సిపిఐ బొబ్బిలి మండల కార్యదర్శి తాడంగి ఎందు దొర తదితరులు పాల్గొన్నారు.

జిబి అప్పారావు జీవితం ప్రజాసేవకే అంకితం

ఆయన రాజకీయాలు నేడు ఆదర్శనీయం

జయంతి వేడుకలలో జెడ్పీ చైర్మన్ చిన్న శ్రీను

విశాలాంధ్ర-జామి: స్వాతంత్ర్య సమరయోదుడు, మాజీ మంత్రి రైతులపాటిల బాందవుడు గొర్రిపాటి బుచ్చిఅప్పారావు జీవితం ప్రజల సేవకే అంకితం చేసారని, ఆయన చేసిన సేవలు నేటికీ అందరికి అందుతున్నాయని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు(చిన్న శ్రీను) అన్నారు. జిబి అప్పారావు 111వ జయంతి వేడుకలను ఆదివారం మండల కేంద్రమైన జామిలోని బజార్‌సెంటర్‌లో ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. ఈకార్యక్రమానికి హాజరైన చిన్న శ్రీను ముందుగా జిబి అప్పారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం స్థానిక వైసీపీ నేతలు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈప్రాంత వాసులు జిబి అప్పారావు పేరును గర్వంగా చెప్పుకోవచ్చని, రైతాంగానికి ఎంతో ఉపయోగపడే తాటిపూడి రిజర్వాయర్ ఏర్పాటు ఆయన వలనే జరిగిందన్నారు. నేటి రాజకీయ నేతలకు ఎంతో ఆదర్శంగా జిబి అప్పారావు జీవితం ఉందన్నారు. ఈప్రాంత వాసుల మనోభావాలను గౌరవించి వైసీపీ ప్రభుత్వం హయాంలో తాను, బొత్స సత్యనారాయణ తదితరులు అంతా కలిసి నాటతి ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి తాటిపూడి రిజర్వాయర్‌కు జిబి అప్పారావు పేరును పెట్టడం జరిగిందన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అనాలోచితకంగా ఆయన పేరును తొలగించడం అత్యంత దారణమన్నారు. ఎన్నో ప్రాజెక్టులకు మహనీయుల పేరును పెట్టడంలో నేటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ చూపారని, అదే రీతిలో తాటిపూడికి అప్పారావు పేరును తిరిగి పునరుద్దరించాలని కోరారు. లేని యెడల కూటమి ప్రభుత్వంపై వత్తిడి తెస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ వేచలపు చినరామునాయుడు,మండల వైసీపీ అధ్యక్షుడు గొర్లె రవికుమార్, జెడ్పిటిసి గొర్లె సరయు, స్థానిక నేతలు అల్లు పద్మ, అల్లు సత్యాజీ, వాకఅప్పారావు, నెక్కలిరమణ, ఆంద్రగోపాలకృష్ణ , అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ముఖ్యనేతలు ,తదితరులు పాల్గొన్నారు.

కిల్లంపల్లి ఆచారి ఆధ్వర్యంలో పంచరత్న నాటక ప్రదర్శన

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్ : ఉత్తరాంధ్ర ఇలవేల్పు విజయనగరం పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా తొలేళ్ళ రోజు సోమవారం రాత్రి 7 గంటలకు పంచరత్నములు నాటక ప్రదర్శన కార్యక్రమం నిర్వహిస్తామని విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కిల్లంపల్లి ఆచారి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం మున్సిపల్ ఆఫీస్ న్యూపూర్ణ సెంటర్లో వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం వద్ద పంచరత్న కార్యక్రమం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తామని అన్నారు రాత్రి 7:30 నిమిషాలకు మురుముల్ల లక్ష్మణరావు ఆచారిచే పంచరత్నములు నాటకం, అనంతరం భాస్కరరావు ఆచారిచే గయోపాఖ్యానం నాటకం కే. రామారావు పద్మావతి వారిచే చింతామణి నాటకం అలాగే రామాంజనేయ యుద్ధం రాయవలస ఉమామహేశ్వరరావు ఆచారి, ఎన్. రమణమూర్తి వారిచే నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

బొత్స రామారావు నాయుడు కుటుంబ సభ్యులను పరామర్శ

ప్రగాఢ సానుభూతిని తెలిపిన డిల్లీ జెడ్జీ సుప్రీం కోర్టు న్యాయవాది

విశాలాంధ్ర-వంగర : తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీ బొత్స వాసు దేవరావు నాయుడు సోదరుడు, మాజీ వంగర సర్పంచ్ బొత్స రామారావు నాయుడు ఇటీవల మరణించిన విషయం విధితమే. ఈయన మరణించిన విషయం తెలుసుకొన్న డిల్లీ హైకోర్టు జడ్జి గేదెల తుషార్ రావు, సీనియర్ సుప్రీంకోర్టు న్యాయవాది యలకల రాజగోపాల్ రావులు ఆదివారం వంగరలో మరణించిన రామారావునాయుడు ఇంటికి వచ్చి ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. రాజకీయాల్లో మంచి మనిషిగా, నిజాయితీతో వంగర సర్పంచ్ గా కల్లాకపటం లేని వ్యక్తిగా, తరతమబేధం లేకుండా ప్రజలకు సేవచేసి, రాజకీయాల్లో నిజాయితీగా వ్యవహరించి, ప్రజల మన్ననలు పొంది, తెలుగుదేశం పార్టీ అభిమానధనునిగా గ్రామ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన బొత్స రామారావు లేరన్న వార్త జీర్ణించుకోలేనిదని వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్ధిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

వైభవంగా దేవి నిమజ్జనోత్సవ కార్యక్రమం

విశాలాంధ్ర -చీపురుపల్లి: పట్టణంలోని వీధిలో ఏర్పాటు చేసిన దేవి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం వైభవపేతంగా దేవి నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. నవరాత్రుల సందర్భంగా చీపురుపల్లి పట్టణంలో ఉన్న రుంకాన వీధిలో స్థానికులు అమ్మవారి మాలాధనం చేసి నవ దినములు ఎన్నో నియమ నిష్టలతో అమ్మవారికి పూజలు నిర్వహించి అనంతరం భారీగా భాజా భజంత్రీలతో... మేళతాళాలతో చేస్తున్న నిమగ్న కార్యక్రమం. కార్యక్రమంలో పాల్గొన్న విజయనగరం జిల్లా వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ఉపాధ్యక్షులు బెల్లాన వంశీకృష్ణ మరియు ఇప్పిలి తిరుమల సీనియర్ నాయకులు అప్పికొండ ఆదిబాబు , స్థానిక ఎంపీటీసీ ముళ్ళు పైడిరాజు , గెరిడి రామదాస్, కర్ణపు ఆది, సువ్వాడ శ్రీను, రెడ్డి శివ, స్థానికులు పాల్గొన్నారు.

నెలివాడ-గొట్లాం ఎన్‌హెచ్ 26 రోడ్డు మరమ్మతులు తక్షణమే చేపట్టాలి

విశాలాంధ్ర-బొండపల్లి : మండలంలోని నెలివాడ బ్రిడ్జి నుండి గొట్లాం వరకు గల ఎన్ హెచ్ 26 రోడ్డు మరమ్మతుల గురై వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఈ రోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్నాయని తారు రోడ్డు వాహనదారులు ఇబ్బందులు పడి వాహనాలను నడుపుతున్నారని ప్రమాదాలు ఎక్కువగా జరుగుతు న్నాయని తక్షణమే ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్ వారు తక్షణమే స్పందించి తగు చర్యలు చేపట్టాలని మండల తెలుగుదేశం పార్టీ యూనిట్ ఇంచార్జ్ బొడ్డు ఉమామహేశ్వరరావు ఒక ప్రకటన ద్వారా ఎద్దేవా చేశారు.

గురజాడ కళాక్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు

విశాలాంధ్ర-విజయనగరం పోర్ట్ : విజయనగరం పట్టణంలో గురజాడ కళాక్షేత్రంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విజయనగరం ఉత్సవాల్లో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి కళాకారులు విచ్చేసి ప్రదర్శనలను అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఏకపాత్రాభినయం సాంఘిక మరియు పౌరాణిక నాటకాలు ప్రదర్శించారు. గయోపాఖ్యానం(యుద్ద సీన్) శ్రీకృష్ణుని పాత్రలో పి. శ్రీను ,అర్జునుడు పాత్రలో ఎం. సత్యనారాయణ ప్రదర్శించారు. మహాభారతం పడక సీన్ దుర్యోధనుడు పాత్రలో కే. మోహన్ దాస్, అర్జునుడు పాత్రలో నారాయణదాసు ఆకర్షించారు. హరిశ్చంద్ర ఘట్టం లో హరిశ్చంద్రుడు పాత్రలో వందన మహేష్ బాబు, చంద్రమతి పాత్రలో సి.హెచ్. ఉమాదేవి ప్రదర్శించారు. కన్యాశుల్కం (విజయ సూర్య ఆర్ట్స్ అసోసియేషన్) మహిళలతో బీ.హెచ్. సూర్యలక్ష్మి ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం మరికొన్ని సాంఘిక, పౌరాణిక నాటకాలు ప్రదర్శించారు.

రిజిస్ట్రేషన్ శాఖలో సమూల మార్పులు, పోడియం దిగిన రిజిస్టర్లు...

విశాలాంధ్ర-చీపురుపల్లి : కూటమి ప్రభుత్వం నూతన ఆదేశాలతో సభ రిజిస్టర్ శాఖలో సమూల మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సబ్ రిజిస్టర్ ప్రత్యేక పోరియంపై కూర్చొని విధులను నిర్వహించేవారు, ప్రభుత్వ నూతన ఆదేశాలతో రిజిస్టర్లు పోడియం దిగి మిగిలిన ఉద్యోగుల మాదిరిగానే సబ్ రిజిస్టర్ కూర్చుని రిజిస్ట్రేషన్ కు సంబంధించిన అన్ని రకాల రికార్డులను తన ముందు ఏర్పాటుచేసిన ప్రత్యేక బించి పైన ఉంచుతున్నారు. గతంలో ప్రత్యేక పోడియం పైన కూర్చుని విధులు నిర్వహించే రిజిస్టర్లు ప్రస్తుతం అందరూ ఉద్యోగులు మాదిరిగానే సమాన హోదాలో కూర్చొని విధులను నిర్వహిస్తున్నారు. సబ్ రిజిస్టర్లకు లబ్ధిదారులకు మధ్య టేబుల్ తప్ప మరేది ఉండకూడదన్న ప్రభుత్వ ఆదేశాలమేరకు చీపురుపల్లి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సమూల మార్పులు చోటుచేసుకున్నాయి, అంతేకాకుండా రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం పనిమీద వచ్చిన లబ్ధిదారులకు గౌరవ సూచికంగా మర్యాదలు పాటించాలన్న ప్రభుత్వ ఆదేశాలను సబ్ రిజిస్టర్ సిబ్బంది అమల్లోకి తీసుకువచ్చారు. ఇదిలా ఉండగా ఆస్తుల క్రయవిక్రయాలు రిజిస్ట్రేషన్లు ఒప్పందాలు వంటి ఎఫెక్టకు ప్రస్తుతం వినియోగిస్తున్న ఈ స్టాంపులకు బదులుగా పాత స్టాంపుల పేపర్లను మళ్లీ అందుబాటులోకి తీసుకురావడం పట్ల స్టాంపు గంటలు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ పాలనలో ప్రత్యేకంగా ఈ స్టాంపింగ్ పేపర్లు వినియోగంలోకి తీసుకురావడం పట్ల క్రయవిక్రయదారుల అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ప్రభుత్వం తాజాగా పాత స్టాంపు విధానానికి తెర లేపినట్టు తెలుస్తుంది. ఈ స్టాంపింగ్ విధానం వల్ల వస్తున్న స్టాంపు పేపర్ను కూడా నాణ్యత లోపం కారణంగా దీర్ఘకాలంగా మన్నిక రాకపోవడం పట్ల వినియోగదారులు అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో ప్రభుత్వం తాజాగా అమలు చేస్తున్న విధానాలతో పాత స్టాంపుల వినియోగాన్ని మళ్లీ వాడుకులోకి తీసుకురావడం పట్ల వినియోగదారులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో నాసిక్ లో తయారుచేసిన జుడీషియల్ స్టాంపులను రిజిస్ట్రేషన్ శాఖలో అఫిడవిట్లకు అమ్మకాలు కొనుగోళ్లకు ఒప్పందాలకు వినియోగించుకునేవారు. అప్పటిలో వినియోగంలో ఉన్న 20 వంద రూపాయల స్టాంపు పేపర్లు నాణ్యత బాగుండేదని, తాజాగా అమలు చేస్తున్న ఈ స్టాంపు పేపర్లు ఎక్కువ కాలం మన్నిక లేకపోవడం పట్ల పాత స్టాంపుల విధానానికే వినియోగదారుల ఆసక్తి చూపుతున్నారు. రిజిస్ట్రేషన్ శాఖలో శాఖా పరమైన మార్పులు జరిపిన ప్రభుత్వం కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ల కొరకు తిరుగుతున్న పలువురు లబ్ధిదారులను దళారులు దోచుకోవడం పట్ల చేస్తున్నారు, రిజిస్ట్రేషన్ శాఖలో నూతన పాలసీలను అవలంబించినట్టే ఆ కార్యాలయంలో పనుల కొరకు లబ్ధిదారులను దోచుకునే దళారుల పైన కూడా సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

నిరుపేదలకు రూ.10వేలు చొప్పున హెల్పింగ్ హ్యాండ్స్ సాయం

విశాలాంధ్ర-చీపురుపల్లి: విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం, ఇటికర్లపల్లి గ్రామానికి చెందిన 40 మంది గవర్నమెంట్, ప్రైవేట్ ఉద్యోగస్తులు కలిసి తన సొంత గ్రామంలో ఏ దిక్కు లేని అనాథలుగా ఉన్న నిరుపేదలైన మూడు కుటుంబాలకు పదివేల రూపాయలు చొప్పున ఆర్థికంగా సహాయం అందించారు. ఆదివారం మండలంలోని ఇటకర్లపల్లి గ్రామంలో ఆ గ్రామానికి చెందిన 40 మంది యువత సుమారు 30 వేల రూపాయలు నగదును మూడు కుటుంబాలకు వితరణగా అందజేశారు. ఇటకర్లపల్లి గ్రామంలో ఎటువంటి ఆడ,మగ దిక్కు లేకున్నా మంచం మీద పడుకొని వుంటూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మూడు కుటుంబాలుకు 1. మాధేటి కృష్ణ కుటుంబానికి 10వేలు, ఒక స్వీట్ బాక్స్ 2. మీసాల పున్నమ్మ వారి కుటుంబానికి 10వేలు, ఒక స్వీట్‌బాక్స్ 3.గాడి నారాయణ వారి కుటుంబానికి 10వేలు, ఒక స్వీట్ బాక్స్ తో హెల్పింగ్ హాండ్స్ పేరు మీదుగా చేయూత నివ్వడం జరిగింది. ఇటకర్లపల్లి గ్రామంలో ఇలాంటి కార్యక్రమం చేయడం ఇదే మొదటిసారి. ఈ కార్యక్రమంలో లెంక రాము, శనపతి సూర్యనారాయణ, దన్నాన పైడిరాజు, కొంచాడ రమణయ్య, షేక్ పీరు సాహెబ్, దన్నాన చిన్న శ్రీను, అలిగి సురేష్ మొదలగు మిగతా ఉద్యోగస్తులు అందరూ పాల్గొనడం జరిగింది.

టీకేఎం అర్బన్ క్రూయిజర్ హైరైడర్ 'ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్ ప్రారంభం

విశాలాంధ్ర-విజయనగరం: టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) ఈ రోజు అర్బన్ క్రూయిజర్ హైరైడర్ 'ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్'ని పరిచయం చేసింది. ఈ సందర్భంగా టికేయం సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ విభాగ ప్రతినిధి శబరి మనోహర్ మాట్లాడుతూ ఇందులో ప్రత్యేకమైన టొయోటా జెన్యూన్ యాక్సెసరీస్ (టిజిఏ) ప్యాకేజ్‌లు ఉన్నాయన్నారు. 2022లో విడుదల అయినప్పటి నుండి, అర్బన్ క్రూయిజర్ హైరైడర్ దాని అత్యాధునిక సాంకేతికత, డైనమిక్ పనితీరు అత్యుత్తమ ఇంధన సామర్థ్యంతో దేశవ్యాప్తంగా వినియోగదారుల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందన్నారు. టొయోటా కిర్లోస్కర్ మోటార్ 2022లో విడుదల చేసినప్పటి నుండి , అర్బన్ క్రూయిజర్ హైరైడర్ స్థిరమైన మొబిలిటీని అందించడంలో టికెఎం యొక్క నిబద్ధతకు చిహ్నంగా ఉందన్నారు. అధిక కస్టమర్ సంతృప్తితో అపూర్వమైన ప్రజాదరణను పొందిందని, పెరుగుతున్న డిమాండ్ సానుకూల ఆదరణ తమ ఆఫర్‌లను నిరంతరం మెరుగుపరచడానికి ప్రోత్సహించాయన్నారు. ప్రత్యేకమైన టిజిఏ ప్యాకేజీని కలిగి ఉన్న అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ఫెస్టివల్ లిమిటెడ్ ఎడిషన్ పరిచయంతో తాము మా కస్టమర్‌లకు మరింత వ్యక్తిగతీకరించిన మరియు ప్రీమియం డ్రైవింగ్ అనుభవాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు.

దేవుని నెలివాడలో గ్రామంలో చోరీ

రూ లక్ష నగదు, 15 గ్రాముల బంగారం అపహరణ

విశాలాంధ్ర-నెల్లిమర్ల: మండ లంలోని రామతీర్థం పంచాయతీ దేవుని నెలివాడ గ్రామంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఒక ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి, రూ.లక్ష నగదు, సుమారు 15 గ్రాముల బంగారం గుర్తు తెలియని ఆగంతకులు దోచుకుపోయారు. బాధితులు అందించిన వివరాల ప్రకారం నెలివాడ గ్రామంలో నివశిస్తున్న దంతినాడ ఉమామహేశ్వ రరావు తన కుటుంబ సభ్యులతో కలిసి, రామతీర్థంలోని అత్తవారింటికి శనివారం వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని గమనించిన ఆగంతకులు శనివారం అర్ధరాత్రి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా తాళాలు పగులగొట్టి, అందులో ఉన్న రూ లక్ష నగదు, 15 గ్రాముల బంగారం దొంగిలించారు. ముందు రోజు తీసుకున్న డ్వాక్రా రుణం మొత్తం రూ లక్ష నగదును దొంగిలించారని బాధితులు వాపోయారు. ఎస్సై గణేష్, క్లూస్ టీమ్ దొంగతనం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. బాధితులను అడిగి, వివరాలు సేకరించారు.

విజయనగరంలో పీఎంజే జువెల్స్ షోరూం ఘన ప్రారంభం

ఏపీలో పీఎంజే కొత్త అవుట్ లెట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పూసపాటి అదితి

విశాలాంధ్ర-విజయనగరం : దక్షిణ భారతదేశంలో అత్యంత ప్రజాధరణ పొందిన జ్యువెలరీ బ్రాండ్ పీఎంజే జ్యువెల్స్ తమ షోరూమ్ ను విజయనగరంలో ప్రారంభించింది. దక్షిణ భారతం, అమెరికాలో ఉన్న పీఎంజే 39 పైచిలుకు స్టోర్లలో ఇది కొత్తది. ఈ బ్రాండ్ దూకుడైన విస్తరణ ప్రణాళికలలో భాగంగా దీన్ని విజయనగరంలో ఏర్పాటు చేశారు. పీఎంజే జ్యువెల్స్ ఆంధ్రప్రదేశ్ అధినేత హైదర్ అలీ, డైరెక్టర్ ఆనంద్ జిలగం, పీఎంజే జ్యువెల్స్ విజయనగరం స్టోర్ మేనేజర్ బి. అనంత్ కుమార్ తో కలిసి విజయనగరం ఎమ్మెల్యే శ్రీమతి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు ఈ కొత్త స్టోర్‌ని ప్రారంభించారు. ఈ ఎలైట్ షోరూమ్ ప్రారంభోత్సవానికి పీఎంజే జ్యువెల్స్ నమ్మకమైన వినియోగదారులు విచ్చేసి ఉత్సాహాన్ని పెంచారు. విజయ నగరం దాని చుట్టుపక్కల ప్రాంతాలలోని వినియోగదారుల విభిన్న అభిరుచులను దృష్టిలో ఉంచుకుని ఈ షోరూమ్ ను ప్రత్యేకంగా రూపొందించామని అనంత్ కుమార్ తెలిపారు. ఈ స్టోర్ ప్రారంభోత్సవంలో విజయనగరం ఎమ్మెల్యే శ్రీమతి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ విజయనగరంలో ఇలాంటి అత్యుత్తమ జ్యువెలరీ స్టోర్‌ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందినీ పీఎంజే జ్యువెల్స్ బృందానికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. పీఎంజే జ్యువెల్స్ తమ వినియోగదారులకు అత్యుత్తమ అనుభవాన్ని అందించగలదని ఆశిస్తున్నామన్నారు. పీఎంజే జ్యువెల్స్ విజయనగరం స్టోర్ మేనేజర్ అనంత్ కుమార్. బి తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ "తమ కొత్త స్టోర్‌లో మంత్రముగ్ధులను చేసే ఆభరణాల డిజైన్‌ల భారీ ప్రదర్శనను ఆస్వాదించడానికి ప్రతి ఒక్కరినీ స్వాగతిస్తున్నామనన్నారు. పీఎంజే జ్యువెల్స్‌లోని డిజైన్‌లు భారతీయ స్వర్ణకారుల అద్భుతమైన నైపుణ్యం, నైపుణ్యా లను ప్రతిబింబిస్తాయి. ప్రారంభోత్సవం సందర్భంగా ప్రదర్శించిన కొత్త డిజైన్‌లను తనిఖీ చేయడం, ప్రయత్నించడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన పీఎంజే నమ్మకమైన వినియోగదారులు ఈ శుభ సందర్భంగా స్టోర్‌ను తమ ఉనికితో ఆశీర్వదించారు. పీఎంజే జ్యువెల్స్ విజయనగరం స్టోర్ మేనేజర్ అనంత్ కుమార్. బి తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, "మా కొత్త స్టోర్‌లో మంత్రముగ్ధులను చేసే ఆభరణాల డిజైన్‌ల భారీ ప్రదర్శనను ఆస్వాదించడానికి ప్రతి ఒక్కరినీ మేము స్వాగతిస్తున్నాము. విజయనగరంలో ఉన్న మా సమీప స్టోర్ పీఎంజే జ్యువెల్స్ ఇన్ని సంవత్సరాలుగా కొనసాగిస్తున్న వారసత్వాన్ని ప్రతిధ్వనిస్తుంది" అని అన్నారు.

శ్రీవారికి ఘనంగా చక్రస్నానం

విశాలాంధ్ర-నెల్లిమర్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో శ్రీ వెంకటేశ్వరస్వామి వారికి చక్రస్నానం శనివారం ఘనంగా నిర్వహించారు. అలాగే ఆలయంలోని యాగ శాలలో పూర్ణాహుతి కార్యక్రమం అర్చకులు వైభవంగా జరిపించారు. గత పదిరోజులుగా ఇక్కడ శ్రీ వేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రాతఃకాల అర్చన, బాలభోగం తదితర కార్యక్రమాలు అర్చకులు జరిపించారు. యాగశాలలో పూర్ణాహుతి కార్యక్రమం ఎంతో ఘనంగా నిర్వహించారు. అనంతరం సుదర్శన పెరుమాళ్లను పల్లకిలో వేంచేపుచేసి, మేళ తాళాలతో కోనేటి వద్దకు తీసుకెళ్లారు. అక్కడ స్వామి వారికి విశేష అర్చన గావించి, వైభవంగా చక్రస్నానం జరిపించారు. ఈ కార్యక్రమాల అనంతరం ఆలయంలో ధ్వజావరోహణం నిర్వహించారు. దీంతో గత పది రోజులపాటు దేవస్థానంలో నిర్వహించిన బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

రోడ్డు ప్రమాదంలో సాక్షి ఛానల్ రిపోర్టర్ ఆర్కే నాయుడు తల్లి వరలక్ష్మి మృతి

విశాలాంధ్ర-బొబ్బిలి : పశ్చిమగోదావరి జిల్లా కాళ్ళ వద్ద గల మలుపులో కారుకి ఎదురుగా వస్తున్న లారీ హెడ్ లైట్ కాంతి పడడంతో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదం. కాంతి ఎక్కువ కావడంతో రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొన్న కారుప్రమాదంలో బొబ్బిలి సాక్షి టీవీ రిపోర్టర్ ఆర్కే నాయుడు మాతృమూర్తి వరలక్ష్మి (59)మృతి, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. వరలక్ష్మి భీమవరం ప్రాంతంలో ఐటిబి ఉద్యోగి. ఆర్కే నాయుడు తల్లి వరలక్ష్మి మృతి పై స్థానిక ఎలక్ట్రాన్ మీడియా ప్రింట్ మీడియా విలేకరులు సంతాపం వ్యక్తం చేశారు.

రాజాంలో పర్యటించిన మంద కృష్ణ మాదిగ

విశాలాంధ్ర-రాజాం: మంద కృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు వర్గీకరణ కు అనుకూలం ఇచ్చిన తరువాత మొట్ట మొదటి సారిగా ఉత్తరాంధ్ర జిల్లాల పర్యటనలో భాగంగా ఈరోజు రాజాం పట్టణానికి విచ్చేసిన సందర్భంగా స్థానిక తృప్తి రిసార్టు నందు రాజాం నియోజకవర్గ నాలుగు మండలాల మాదిగ, రెల్లి, ఎస్సీ ఉప కులాల పెద్దలు కృష్ణ మాదిగ కు ఘన స్వాగతం పలకడం జరిగినది. ఈ సందర్భంగా కృష్ణ మాదిగ మాట్లాడుతూ, తెలంగాణలో కమిషన్ వేసినట్లు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కూడా గతంలో వర్గీకరణ అమలు పరిచిన వ్యక్తిగా అయన చిత్తశుద్ధి తో పనిచేస్తారని విశ్వాసం వ్యక్తం చేయడం జరిగినది. మాదిగ, రెల్లి ఉపకులాలు అందరూ సంనయనం పాటించాలని సూచించడం జరిగినది. ఈ కార్యక్రమం లో రాజాం నియోజకవర్గం మాదిగ ఉద్యోగుల అధ్యక్షులు అరసాడ ఆనందరావు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యందవ రవికుమార్. ఎంఈఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యాదర్శి యందవ నారాయణరావు. పొలు. మురళి, రాజాం నియోజకవర్గం ప్రచార కన్వీనర్ యందవ ఆనందరావు. కుల పెద్దలు అధిక సంఖ్య లో పాల్గొనడం జరిగింది.